# మనసులో మనిషి

వింధ్యవాసిని



ఫస్టుక్లాస్‌లో రైలు ప్రయాణం చేయటమిదే మొదలు భారతికి. అదీ ముందుగా అనుకోకపోవటం వల్ల, సెకండ్‌క్లాస్‌లో బెర్త్ దొరకక, ఇలా బయలుదేరింది. హైద్రాబాదులో రైలు ఎక్కగానే, ఖాళీగా ఉన్న ఎదురు బెర్త్ వయిపు చూసింది. దానిమీదొక సూట్‌కేస్, బ్రీఫ్‌కేస్ ఉన్నాయి. బ్రీఫ్‌కేస్ హేండిల్‌కున్న లేబిల్ పైనున్న అక్షరాలు చదివింది. సి. చంద్రశేఖరం, పర్సొనల్ ఆఫీసర్, ఒమేగా ఫార్మస్యూటికల్స్ కో., బెంగుళూరు-అని ఉంది. 'ప్రయాణం చివరివరకూ ఈయన నాకు తోడు అన్నమాట' అనుకుంది. పేరునుబట్టీ, ఉద్యోగాన్నిబట్టీ వయసునీ, మనిషినీ ఊహించటానికి ప్రయత్నించబోయింది, కానీ కుదరలేదు.

రైలు బయలుదేరుతుందని సూచన వినిపించింది. దాదాపుగా, నలభయ్యేళ్ళలోపు వయసుండచ్చునని పించే ఒకతను హడావిడిగా రైలు ఎక్కేడు. కొద్దిగా నలిగిన గ్రేకలర్‌సూటు, పలుచని క్రాపులోంచి ఉండీ లేనట్లుగా కనిపించే బట్టతల, చంపల మీద కొద్దిగా తెల్లవెంట్రుకలు, నున్నగా షేవ్ చేసుకున్న గడ్డం, చేతిలో కాల్తున్న సిగిరెట్టు ఇదీ అతన్ని మొదటి చూపులో భారతి వేసిన అంచనా. మామూలుగా ఇంత సీరియస్‌గా మనుషుల్ని, అందులోనూ మగవార్ని గమనించటం ఆమెకి అలవాటులేదు. కానీ ఇవాళ, తనతోబాటు 15 గంటలసేపు ప్రయాణం చేయబోతున్న ఆ వ్యక్తిని అలా విశ్లేషించి చూడటం, అనుకోకుండా జరిగిపోయింది.

చంద్రశేఖరం కాలిపోయిన సిగరెట్‌ని అవతలికి విసిరేసి, సీటులో సర్దుకు కూచుని, అప్పుడే కొన్న ఇంగ్లీషు వీక్లీ చదవసాగేడు. అతని దృష్టి ఎదురుగా ఉన్న భారతి పయిన పడకపోలేదు. ఆమె ముడివేసుకున్న తీరు, కట్టుకున్న చేనేత సిల్కుచీర చూడగానే, ఉద్యోగిని అని అర్థం అయింది. అతను స్వతహాగా మితభాషి. ఒంటరిగా ఎన్ని గంటలయినా సులభంగా దొర్లించివేయగలడు. మామూలుగా ఎవరితోనూ పరుషంగా మాట్లాడే అలవాటు లేకపోయినా, ఆ ముఖంలో కనిపించే సీరియస్‌నెస్, గట్టిగా బిగించినట్లుండే పెదవులు, చిట్లిస్తున్నట్లుగా ఉండే నుదురు, ఎదుటివాణ్ణి చీల్చేలా చూసే చూపులు- ఇవన్నీ అతని సబార్డినేట్స్‌ని అదరగొట్టేస్తాయి; కొలీగ్స్‌ని ఆమడదూరంలో ఉంచేస్తాయి.

ఎదురుగా కూచున్న వ్యక్తి, సంభాషణకి ఏమయినా నాంది వేస్తాడేమోనని చూసింది భారతి.

అతనా ప్రయత్నం ఏదీ చేసేలా కన్పించకపోయే సరికి బయటికి చూస్తూ ఆలోచనల్లో పడిపోయింది.

దాదాపు ఒక గంట గడిచింతర్వాత రైల్వే కాంటీన్ బోయ్ కాఫీ తెచ్చేడు. చంద్రశేఖరం ఓ కప్పు తీసుకుంటే, ప్రశ్నార్ధకంగా చూసేడు బోయ్, భారతి వయివు చూపులు తిప్పుతూ. భారతి గమనిస్తూనే వుంది. తనూ తీసుకుందామా! అనుకుంది. ఇంతలో అతనే, 'కాఫీ తీసుకుంటారా?' అనడిగేడు. బోయ్ ముందు కర్టెసీ లేనివాడిలా కన్పించట మిష్టంలేక అడుగుతున్నాడేమోనన్పించింది ఆమెకి. ఎలాగయితేనేం, 'ఊ' అని కప్పు తీసుకుంది. ఖాళీ కప్పులిచ్చిన తర్వాత డబ్బు కోసం, పాంటు జేబులో చేయి పెట్టేడు చంద్రశేఖరం. అంతలో షాక్ తిన్నవాడిలా చేయి బయటికి తీసి కోటు జేబులు, పాంటు బేక్ పాకెట్ అన్నింట్లో చేయిపెట్టి చూసుకున్నాడు కంగారుగా. పరిస్థితి కొద్దిగా అర్థమయింది భారతికి.

"కాస్త నిదానంగా చూసుకోండి. చిల్లర నేనిస్తాను" అని ముందా అబ్బాయిని పంపేసి, చంద్రశేఖరం వయిపు చూసింది.

అప్పటికి వెతకటం అయింది.

"ఎక్కడో పిక్‌పాకెట్ అయినట్లుంది. అయి హేవ్ లాస్ట్ మై పర్స్" అన్నాడు చిన్నగా. ముఖంలో అంతదాకా వున్న గాంభీర్యం, గర్వం అన్నీ మటుమాయమయినాయి. "ఇప్పుడు నేనేం చేసేది? నాకెవరు సహాయం చేస్తారు" అని అతను పయికి అనకపోయినా, అతని వయిపే చూస్తున్న భారతికి డైలమా అర్థం అయింది.

"ఇటువంటి సమయాల్లో ఆలోచనల్తో టయిం వ్యర్థం చేయదామె. వెంటనే ఏదో అనబోయేంతలో, టికెట్ కెలెక్టర్ వచ్చేడు.

చంద్రశేఖరం బుర్ర పనిచేయటం లేదు. పిచ్చి వాడిలా చూస్తున్నాడు. తన టికెట్ అందిస్తూ, "చూడండి, ఆయన పర్స్ ఎవరో కొట్టేసారు. టికెట్‌కెంతవుతుందో చెబితే నేను పే చేస్తాను" అంది భారతి.

ఎవరో ఒకరు పేచేస్తే, టి. సి. కేం బాధలేదు. అందుకనే మారు మాటాడకుండా డబ్బు తీసుకుని రసీదిచ్చి వెళ్ళిపోయేడు. రసీదుతోబాటు, ఓ ఏభై నోటు అతని కందించింది భారతి.

చంద్రశేఖరానికిది కలో నిజమో అర్థం కావటం లేదు. మొట్టమొదట పర్స్ పోగొట్టుకొని, ముక్కూ మొఖం తెలియనామె ముందు బయటపడడమే సిగ్గుగా అనిపించింది. దాని వెనుకే టికెట్ చెకింగ్ జరగటం, తనతో ఎలాంటి పరిచయమూ లేని ఆమె ఇలా సహాయపడటమూ మరింత షేమ్‌ఫుల్‌గా తోచింది. తన దురదృష్టానికి లోలోపలే తిట్టుకున్నాడు.

"అయామ్ వెరీ సారీ! మీకెలా థాంక్స్ చెప్పాలో తెలియటం లేదు. ఊరు చేరగానే మీ డబ్బు అందజేస్తాను." అన్నాడు. మాటలు ఒక్కొక్కటే వినీ విన్పించనట్లుగా వచ్చినా, భారతి చెవులకి అందేయి.

ఆమె అలా సహాయం చేయబట్టి సరిపోయింది కానీ, అతను తనై భారతినిగానీ, ఆమె ప్లేస్‌లో మరెవరున్నాగానీ, చచ్చినా అడిగుండేవాడు కాదు. ఏమయితే అయిందని, వచ్చిన నెక్స్ట్ స్టేషన్‌లో దిగిపోయేవాడు.

అతనలాంటి వాడని భారతి చూచాయగా ఊహించగలిగిందేమో, అందుకే ఆలస్యం చేయకుండా ఇనీషియేటివ్ తీసుకుంది.

*

చంద్రశేఖరానికి లోకం మీదా, తన చుట్టూవున్న మనుషులని గూర్చి కొన్ని ప్రత్యేకమైన అభిప్రాయాలున్నాయి. సహాయం అనే పదమే లేదు అతని పరిభాషలో. ప్రతిఫలాన్ని కోరకుండా, ఎవరూ సహాయం చేయరని, కర్టెసీ, సింపతి అనే పదాలు వట్టి అర్థంలేని అనాగరికపు తొడుగులనీ అతని వుద్దేశం. అంతవరకూ తనెన్నడూ చూడని, రైలెక్కి గంటసేపయినా, ఒక్క మాట కూడా ఆడని, ఈమె ఎవరో తన అంచనాలని కాస్త కదిలించినట్లయింది – అతనికి.

ఇప్పటికయినా సంభాషణ మొదలుపెట్టడం తన విధి అనిపించింది చంద్రశేఖరానికి.

"ఎందాకా వెళుతున్నారు?" అన్నాడు.

"బెంగళూరు."

"హైదరాబాద్ ఏదయినా పనిమీద వొచ్చేరా?"

"ఉహూ కాదు. హైదరాబాదులోనే ఉద్యోగం. పని మీద బెంగళూరు వెళుతున్నా!"

అతన్ని గూర్చి అడగాలన్పించింది భారతికి.

"మరి మీరు...."

"నన్ను చంద్రశేఖరం అంటారు. ఒమేగా ఫార్మస్యూటికల్స్‌లో వర్క్ చేస్తున్నాను. ఆఫీసు పని మీద అప్పుడప్పుడిలా రావలసి వుంటుంది. ప్రయాణంలో పర్స్ పోవటమిది మొదలు. ఎప్పుడూ యిలా అవలేదు" క్షమాపణ చెప్పుకుంటున్నట్లుగా వుందతని స్వరం.

"పోనీయండి. అదే పనిగా దాన్ని గురించి దిగులు పడ్డారంటే, ఉదయం ఇల్లుచేరేలోగా నీరసం వచ్చేస్తుంది."

ఎందుకీమెకింత జాలి? – అనుకోకుండా వుండలేకపోయాడు చంద్రశేఖరం. 'మనిషి చూస్తే హిందువులా వుంది. ముఖాన బొట్టు మాత్రం లేదు' అనుకున్నాడు.

"మరి ఫేమిలీ అంతా...."

"ఫేమిలీ ఏంలేదు. అయామ్ ఎలోన్...." కొద్దిగా వణికిందామె స్వరం. "మా బాబాయి బెంగళూర్లో ఉంటారు. అక్కడ వేరే జాబ్‌కి ట్రై చేస్తున్నారు నా కోసం. ఆ ఇంటర్వ్యూకే వెళుతున్నాను" అన్నది.

అర్థమయిందతనికి సులభంగా. ఎందుకంటే అతని స్థితీ అదే కనుక. అతని భార్యపోయి ఆరేళ్ల దాటింది. అప్పట్నించీ మళ్ళీ పెళ్ళి చేసుకోవాలని అన్పించటం కానీ, అందుకు అవసరంగానీ కన్పించ లేదు. తన్ను తాను పూర్తిగా కంపెనీకి, ఉద్యోగానికి అంకితం చేసుకున్నాడు. సేల్స్ రిప్రజెంటేటివ్‌గా మొదలు పెట్టినవాడు, అతి త్వరలో పైకి వచ్చి పర్సనల్ మేనేజర్ అయేడు.

ఆఫీసు పని, ఆఫీసులో సబార్డినేట్స్. కొలీగ్స్ మధ్య మూవ్ అవటం తప్ప, అతని పర్సనల్ లైఫ్ పూర్తిగా ఒంటరితనమే. మనసుకి దగ్గరగా వచ్చిన స్నేహితులెవరూ లేరు.

అందుకనే ఈ అపరిచిత వ్యక్తితో ఏర్పడిన స్నేహం, సాన్నిహిత్యం వింత అనుభవాన్ని కలిగిస్తున్నాయి చంద్రశేఖరానికి.

మామూలుగా అవుతే, ఒక్క మాటయినా ఆడకుండానే ప్రయాణం ముగించి ఉండేవాడేమో. ఇప్పుడీమె, తానెవరు ఏమీ తెలియకుండా తన్నొక విపత్కర పరిస్థితి నించీ రక్షించింది. అందుకు కృతజ్ఞతగా అయినా సంభాషణ పెంచాలనిపిస్తోంది.

కోటు తీసి విండో పక్కనున్న హుక్‌కి తగిలించి, టై లూస్ చేసుకుని, మళ్ళీ వీక్లీ పుచ్చుకుని కూచున్నాడు. మధ్య మధ్యలో తనకి తెలియకుండానే అతని చూపులు వెళ్ళి ఆమెని తాకి వస్తున్నాయి.

ముచ్చటగా ఉన్న ముడిలో ఓ రోజా ఉంటే,

మరింత చక్కగా ఉండేదేమో అన్పించింది. కట్టుకున్న పట్టు చీర బోర్డర్‌లోంచి పెద్ద ఏనుగులు, తొండాలెత్తి చూస్తున్నట్లుంది. సాయిబాబా బొమ్మ ఉన్న పుస్తకం ఒకటి చదువుతోంది. చీర అంచు కిందుగా సున్నితంగా ఉన్న చిన్న పాదాలు పక్కగా విడిచిన చెప్పులు.

చంద్రశేఖరం చూపుల స్పర్శ తెలుస్తోనే ఉంది భారతికి. చదువుతున్న పుస్తకం మీద మనసు లగ్నం చేయలేకపోతూంది. టయిం చూసుకుంది. ఎనిమిది గంటలు అవస్తూంది. కొద్దిగా ఆకలవుతోంది. కారియర్‌లో తెచ్చుకున్న భోజనం బయటికి తీద్దామా అనుకుంది. అతని సంగతేమిటని సందేహం వెనువెంటనే. పోనీ తనే ఆఫర్ చేద్దామంటే మరీ చనువు తీసుకున్నట్లుంటుందేమోనని సంకోచం.

బోయ్ వస్తే, ప్రశ్నార్థకంగా చూసాడు చంద్రశేఖరం భారతి వయిపు. కేరియర్ చూపించింది.

"నేను నాన్‌వెజిటేరియన్ తీసుకుంటే ఏం అభ్యంతరం లేదుకదూ?" అన్నాడు. బిగించినట్లున్న పెదాల మీద చిరునవ్వు కూడా అదోలా కన్పించిందామెకి.

"ఫరవాలేదు. నేను వెజిటేరియనేం కాదు."

మౌనంగా భోజనాలు చేసారు.

అతను టై, షూస్ విప్పి అవతల పెట్టేసి, సీట్ మీద కాళ్లు చాచి సిగిరెట్ వెలిగించుకున్నాడు.

భారతి లేచి బాత్‌రూమ్‌కి వెళ్ళి వచ్చేలోగా ఆమె పుస్తకం అతని చేతిలో వుంది. చంద్రశేఖరానికి మాట్లాడేందుకు విషయం దొరికినట్లయింది.

"మీరు సాయి బాబాని నమ్ముతారా?"

"అవును. దేవుడుగా పూజిస్తాను. వీలయినప్పుడంతా దర్శనం చేసుకుంటాను."

"ఏమో ఇన్నేళ్ళయి బెంగళూరులో వున్నా ఎప్పుడూ ఆయన్ని చూడటం జరగలేదు" అలాగే సంభాషణ కొనసాగింది.

మాటల మధ్య, ఆమెని గురించి కొంతవరకూ తెలుసుకున్నాడు చంద్రశేఖరం. చిన్నప్పుడే భర్త పోతే, బాబాయి సహాయంతో చదువుకుని, స్వంతంగా సంపాదించుకుని, స్వతంత్రంగా బ్రతుకుతున్న ఆమె ఆత్మ విశ్వాసాన్ని హర్షించకుండా వుండలేకపోయాడు అతను.

రాత్రెప్పుడో కళ్ల మూతలు పడి నిద్రపోయే ముందు తోచింది భారతికి. "ఇంతదాకా మాటల్లో పెట్టి, నన్ను గురించిన వివరాలన్నీ వాగించేడీయన. ఇంతకీ తనని గురించి మాత్రమొకమాటైనా అనలేదు. కొంతమంది అంతే గుంభనంగా వుంటారు" అనుకుంది.

అంతలో అన్పించింది. "ఈ రాత్రి ఒంటరితనంలో ఈ అపరిచిత వ్యక్తి నన్నేమయినా చేస్తే" అని. కానీ ఆ భయం ఎక్కువసేపు నిలువలేదు. "ఛః నా పిచ్చిగానీ ఈ భయాలేమిటి? భగవంతుడి అనుగ్రహం ఎప్పుడూ నావెంట వుండి, నన్ను కాపాడుతుంది" అని ధైర్యం చెప్పుకుని ప్రశాంతంగా నిద్రపోయింది.

చంద్రశేఖరానికా రాత్రి నిద్ర కరువయింది. నిద్రపోతున్న ఆమె వయిపు చూస్తూ అలా ఎన్ని గంటలు గడిపేడో తెలీదు. కారణం ఏమిటోగానీ, తానామె వయిపు ఆకర్షింపబడటం మాత్రం అతనికి తెలుస్తోంది.

కొన్ని గంటల పరిచయానికే, ఎన్నాళ్ళుగానో సంబంధం వున్న వ్యక్తిగా అనిపించింది. ఉదయం రైలు దిగి వెళ్ళే ముందు, భారతి అడ్రస్ తీసుకున్నాడు.

## 2

చంద్రశేఖరాన్ని మామూలు తోటి ప్రయాణీకుడిలా మర్చిపోలేక పోయింది భారతి. ఒక ప్రత్యేకమయిన వ్యక్తిగా, సీరియస్‌గా ఉన్న ఆ ముఖం, గుచ్చుతున్నట్లుగా చూసే కళ్లు, తూచినట్లు మాట్లాడే స్వరమూ, ఆమెని వెంటాడుతూనే వున్నాయి. మొదట్లో రెండు మూడు రోజుల్లోపల అతను తనకివ్వాల్సిన డబ్బు తీసుకుని ఇంటికి వస్తాడనుకుని, ఎంతో ఎదురు చూసింది. అతను రాలేదు. అప్పటికింక, అతనసలా విషయాన్ని పూర్తిగా మరిచేడేమో, ఎప్పుడో గుర్తొస్తే, పోస్టలో ఓ చెక్ పంపుతాడు కాబోలు — అనుకుంది నిస్పృహగా.

తనలో వస్తున్న రియాక్షన్ తనకే వింతగా ఉంది. ఆమెకు తెలిసినంతలో, తన మనసునీ ఆలోచనల్నీ ఇంతగా ఆక్రమించిన వారు ఇప్పటిదాకా ఎవరూ లేరు.

మొదట ట్రెయినులో సంఘటన గురించి బాబాయికి చెప్పకూడదనుకుంది. కానీ హఠాత్తుగా ఒకరోజతను ఇంటికొచ్చేస్తే, అప్పుడు సంజాయిషీ ఇవ్వాల్సి వస్తుంది. ఇదంతా ఎందుకని, చూచాయగా చెప్పి ఉంచింది. పిన్ని ఊళ్లోలేదు. ఆమే గనక ఉంటే, "ముక్కూ మొఖం తెలీని వాడికి అంత ధైర్యంగా నూటఏభై రూపాయలెలా ఇచ్చేవ్? అతను తెచ్చిస్తాడని నమ్మకమేమిటి?" అని యక్షప్రశ్నలేసి చంపి వుండేది.

రామనాథానికి అన్నయ్య కూతురు భారతి. చిన్నప్పుడే అమ్మా, నాన్నా పోయారు. పద్నాలుగేళ్ళకే పెళ్ళి చేశారు అవ్వా, తాత కలిసి. మూడేళ్ళయినా కాపురం చేయక ముందే భర్త పోయాడు. అలాంటి పరిస్థితుల్లో రామనాథమే ధైర్యం చేసి, అందర్నీ ఎదిరించి, ఆమెని చదువులో పెట్టకపోతే ఆమె జీవితమెలా ఉండేదో? రామనాథానికి పిల్లలు కలగలేదు. దాంతో భార్య భర్తలిద్దరూ, భారతి పైనే తమ ప్రాణాలు పెట్టుకున్నారు. పిన్ని రాజేశ్వరి ఎప్పుడూ భారతి గురించి దిగులుపడుతూ ఉంటుంది. తామిద్దరూ ఉన్నన్నాళ్ళు ఫరవాలేదు. తర్వాత భారతి ఒంటరిదయి పోతుందే అని. కానీ ఆమెకి పునర్వివాహం చేయాలనే ఉద్దేశం మాత్రం వారికెప్పుడూ కలగలేదింతవరకూ.

మొట్ట మొదటగా హైదరాబాదులో ఉద్యోగం రావటంతో అక్కడే వుండి పోయింది భారతి. ఆమె వచ్చి బెంగుళూరులో తమతోపాటు ఉండాలని, ఎన్నాళ్ళుగానో ప్రయత్నిస్తున్నాడు రామనాథం. ఇప్పటికాయన ప్రయత్నాలు ఒక కొలిక్కి వచ్చేయి. ఒక గర్ల్స్ హైస్కూలు హెడ్‌మిస్ట్రెస్ రిటయిరవుతే, అడ్వర్టయిజ్‌మెంటిచ్చారా పోస్టుకి. ఆ స్కూలు బోర్డ్ మెంబర్స్ ఇద్దరు రామనాథానికి బాగా తెలుసు. అందుకనే నమ్మకంగా భారతికీ ఉద్యోగం వస్తుందని దరఖాస్తు చేయించారు. ఇప్పుడు ఇంటర్వ్యూకి వచ్చిందామె.

బాబాయి, కూతురు స్నేహితుల్లా వుంటారు. భార్య ఎవరో చుట్టాల పెళ్లికి వెళ్లిన సమయంలో భారతి రావటం రామనాథానికి రిలీఫ్‌గా వుంది. రిటయిరయినప్పట్నించీ భార్యా భర్తలిద్దరూ మరింత ఇంటిమేట్‌గా వుంటున్నారేమో, ఆవిడ వూరు వెళ్ళితే, ఈయనకేదో పోగొట్టుకున్నట్లుగా ఉంది.

భారతి వచ్చి వారమయింది. ఆ వేళ ఆదివారం. టవున్‌హాల్‌లో మంచి మాజిక్ షో వుందని, ఇద్దరూ వెళ్ళటానికి టికెట్స్ తెప్పించుకుంది.

మధ్యాహ్నం రెండు గంటలయి వుంటుంది. భోజనం చేసి చిన్నగా ఓ కునుకు తీయటం అయి భారతిని పిలిచాడు రామనాథం. "అమ్మాయి! రెడీ అవుతున్నావా?" అని. ఇంతలో పక్కింటి అబ్బాయి వచ్చి, "సార్ మీకు ట్రంకాల్ వచ్చింది కర్నూల్నించి" అన్నాడు. వాళ్ళింట్లో ఫోన్ ఉంది.

అది వీరు ఉపయోగించుకోవటం వాళ్ళ కథ్యం తరం కాదు.

ఇంతకీ విషయమేమిటి అంటే భారతి పిన్నిని ఉదయమే రైలెక్కించారట. స్టేషన్‌కి వెళ్ళి రిసీవ్ చేసుకోవాలి అని.

అలాగయితే ప్రోగ్రాం కాన్సిల్ చేసుకుని ఇద్దరం కలిసి స్టేషన్‌కి వెళ్ళదామని భారతి అన్నది. అందుకు రామనాథం ఒప్పుకోలేదు.

"అన్యాయంగా రెండు టికట్లెందుకు వేస్టవాలి. నువ్వెళ్ళిరా అమ్మాయి. నే వెళ్తాను స్టేషనుకి" అన్నాడు.

వీరిద్దరూ ఇలా తర్జన భర్జనలు పడుతుండగా ఇంటి ముందు స్కూటర్ ఆగిన చప్పుడయింది. హఠాత్తుగా ఎదురుగా వరండాలో సంశయంగా నిలుచున్న చంద్రశేఖరాన్ని చూసేసరికి, ఏం చేయాలో అర్థం కాలేదు భారతికి.

ఎవరూ ?—అన్నట్లుగా చూస్తున్నాడు రామనాథం, కళ్ళజోడు సవరించుకుంటూ. భారతే త్వరగా కోలుకుంది. "రండి" అని చిరునవ్వుతో స్వాగతం పలికి, "ఈయన చంద్రశేఖరం గారని, నాతోబాటు ట్రెయినులో కలిసి వచ్చారని చెప్ప లేదూ ? వారే బాబాయ్" అని అప్పు తీర్చుకోవటానికి వచ్చారులా వుంది అని అనుకుంది మనసులో.

తనెదురుగా వుంటే చంద్రశేఖరం అలా మౌనంగానే ఉండిపోవచ్చుని, కాఫీ మిషతో లోపలికి వెళ్ళింది. "మాట్లాడుతూ వుండండి" అని చెప్పి. ఎలాంటివారినయినా మాటల్లో పెట్టగల వాకచక్యం బాబాయికుందని ఆమెకి తెలుసు. అందుకే ఆయన దగ్గర అతన్ని వదిలేసి జారుకున్నది.

ఆ రోజు ట్రెయిన్‌లో చూసినప్పటి కంటే స్మార్ట్‌గా తయారయి వచ్చేడు. పలుచగా వున్న క్రాపుని బట్టతల కన్పించనీయకుండా జాగ్రత్తగా దువ్వినట్లు ఒక్క చూపులో గ్రహించింది భారతి. మరీ అఫీషియల్‌గా కనిపించే బిజినెస్ సూట్ కాకుండా, మామూలు చిన్న చెక్స్ వున్న బుష్ షర్ట్, వైట్ పేంటు వేసుకుని వున్నాడు. ఈ మీటింగ్ కోసం అతను ప్రత్యేకం తయారయి వచ్చినట్లు తెలుస్తోంది. తన ఆలోచనలకి తానే నవ్వుకుంది భారతి.

కాఫీలు వచ్చేసరికి; సంభాషణ సాగుతోంది.

"అన్నట్లు నే వచ్చేసరికి ఎక్కడికో వెళ్ళాలనుకుంటున్నట్లున్నారు?" అడిగేడు చంద్రశేఖరం.

## శ్మశానం

అతి విశాలమైన జీవితాన్ని
అటు ఆరు, ఇటు మూడు అడుగుల్లో
అద్భుతంగా ఇముడ్చుకోగల
అత్యంత విచిత్ర ప్రదేశం శ్మశానం—

ఆశా నిరాశల నడుమ
అనంత సంగ్రామం సలిపి
అసువులు బాసిన మనుషుల
ఆత్మలకు అంతఃపురం శ్మశానం—

భీకర కులమత కుహరాలలో చిక్కి
అంతస్తుల పాదాలకింద నెత్తురు కక్కి
అనురాగం కోసమే అసువుల్నీ త్యజించిన
అమర ప్రేమికుల ప్రణయశాల శ్మశానం—

కోట్లకు పడగ లెత్తిన వాడికీ
కూటికి గతిలేని దరిద్రుడికీ మధ్య
అంతరాలెప్పుడూ తలెత్తని
మహా వింత ప్రదేశం శ్మశానం—

నువ్వూ నేనూ కలిసి మెలసి
నూరేళ్ళు జీవించాలని భర్తపై
కలలుగన్న యిల్లాలి నల్లపూసలను
నిలువెల్లా త్రెంపిన నిర్దయభూమి శ్మశానం—

—వీరపల్లె వీణావాణి

"అవునవును. మంచి మాజిక్ షో మిస్సవటం తప్పదు నాకు. మా మిసెస్ కోసం స్టేషన్‌కి వెళ్లాలి. ఫరవాలేదు మా అమ్మాయి చూస్తుంది గద, అన్నీ వివరించి చెప్పేస్తుంది నాకు...."

"బాబాయ్...." ఏమో అనబోయింది భారతి.

"నువ్వింకేం మాట్లాడకు భారతీ. ఆలస్యం చేశావంటే అక్కడ షో మొదలవుతుంది." అని తొందరపెట్టేడు రామనాథం.

కాఫీలు తాగటం అయింది. "వెళ్ళొస్తాను" అంటూ లేచాడు చంద్రశేఖరం.

ఆటో కోసం చూస్తూ కొంతదూరం నడిచారిద్దరూ. "పోనీ మీరు వెళ్లి రండి. నాతోబాటు నడుస్తూ ఎందుకు ..." మొహమాటంగా అంది భారతి.

"పోనీ లిఫ్ట్ యిస్తాను రండి. మిమ్మల్నక్కడ వొదిలేసి నేనటు వెళతాను" సంకోచంగానే అడిగేడు.

అతని ఆఫర్‌కి ఒప్పుకున్నాక, అతన్ని షోకి రమ్మని ఆహ్వానించడం సహజం అనిపించింది భారతికి.

## 3

షో జరిగిన మూడు గంటలసేపు, భారతి శ్రద్ధగా స్టేజి మీద జరుగుతున్నదే చూస్తుంటే, చంద్రశేఖరం తమిద్దరి మధ్య మాటలకీ, చేతలకీ అందని మాజిక్ ఏదో జరుగుతోంటే గమనిస్తున్నాడు.

ఇంటర్వెల్లో ఒకరిద్దరు తెలిసిన వారు పలుకరించేరు చంద్రశేఖరాన్ని. భారతినేమని పరిచయం చేయాలో తెలీక, ఆ పనికే పూనుకోలేదతను. పలుకరించిన వారికి మాత్రం ఇతన్నిలా చూడటం వింతగా వుంది. అతను ఇల్లు, ఆఫీసు తప్ప ఇలాంటి ఎంటర్‌టెయిన్‌మెంట్సుకి రావటం, ఇంత దాకా ఎవరూ చూడలేదు. అదీ అతనికి ఈడు జోడుగా, చక్కగా వున్న భారతి జతలో, ఏదో కొత్తగా కన్పిస్తున్నాడు. అతనికీ ఏదోలా అన్పించక పోలేదు. అయినా భారతి సాన్నిహిత్యంలో వున్న ఏదో ఆకర్షణలో పడి యివేవీ గమనించగల స్థితిలో లేడు.

మెల్లిగా మాట్లాడుకుంటూ చిరునవ్వులు చిందిస్తూ, ఒకరికోసమొకరన్నట్లు కన్పిస్తున్న మధ్య వయసు జంటలెవర్ని చూసినా, తాము అలా వుంటే - అనే ఆలోచన మొదటిసారిగా అతని మనసులో ప్రవేశించింది. తర్వాత జరిగిన సంభాషణలకీ, పరిణామాలకీ అదే నాంది అయింది.

అతడి భార్య పోయిన కొత్తలో మళ్ళీ పెళ్ళి చేసుకొమ్మని చాలామంది సలహా ఇచ్చేరు. దగ్గరివాళ్ళు కొన్ని సంబంధాలు కూడా సూచించారు. అయితే అతను మళ్ళీ పెళ్ళి వయిపు మొగ్గు చూపలేదు ఎవరెన్ని చెప్పినా. అందుక్కారణం మొదటి భార్య మీది ప్రేమ మాత్రం కాదు. ఒక విధంగా ఇద్దరికీ అంత సరిపోలేదని చూసే వాళ్ళకి అర్థమయే లాగానే వుండేది వాళ్ల దాంపత్యం. తన ఆస్తితో అతన్ని కొనుక్కున్నాననుకొనేది. అతను చేసే సేల్స్ రిప్రజంటేటివు ఉద్యోగం ఆమె కళ్ళకి ఆనలేదు.

. చంద్రశేఖరం మొదటినించీ తన స్వశక్తినే నమ్ముకున్నాడు. అందుకనే ఉద్యోగం మీది శ్రద్ధతో భార్య అభిమానాన్ని సంపాదించలేకపోయాడు. ఆవిడ పోవటంతో ఓ బెడద తీరినట్లు భావించక పోలేదు.

ఇన్నేళ్ళకి ఇలా రైల్లో అయిన పరిచయంతోటే తనింతగా భారతి వయిపు ఆకర్షితుడవటం అతనికీ ఆశ్చర్యంగానే వుంది. అతను స్త్రీ స్పర్శ ఎరుగని వాడు గాదు. ఇన్నేళ్లు బ్రహ్మచారిగా వుండాలనే ప్రయత్నమూ చేయలేదు. అయినా, అలా ఆ ఆడి టోరియంలో భారతి పక్కన కూచోవటమే ఒక వింత అనుభూతిని కలిగిస్తోంది. పవుడర్లు, సెంటు వాసనల కతీతమయిన సువాసన ఏదో ఆమె నుంచి వచ్చి, తన చుట్టూ ఆవరిస్తున్నట్లుగా వుంది. ఆమెలోనుంచి ఏవో మేగ్నెటిక్ వేవ్స్, తన మనసునీ తనువునీ ఒకటిగా చేసి లాగుతున్నట్లుగా వుంది.

"నో ఇటీస్ ఇంపాసిబుల్. ఈమెని వదిలి వుండలేను" అని నిర్ణయించుకున్నాడు.

షో అయాక పెద్ద హోటలుకి తీసుకెళ్ళాడు భారతిని, కాఫీ తీసుకుని వెళదామని. మాటల్లో తెలిసింది మరో రెండు రోజుల్లో ఆమె ప్రయాణ మవుతోందని. అతని మనసు మరింత తొందర పెట్టింది, లోపలున్న మాట బయట పెట్టమని.

"మళ్ళీ తిరిగి రావటం?" అడిగేడు.

"ఇక్కడ సెలక్షన్ రావటంలో నైన్టీ పర్సెంట్ హోప్ వుందనుకోండి. రిసల్ట్ బాబాయి తెలపగానే, పెట్టే బేడా సర్దుకుని వచ్చేయడమే!"

"ఉహూ...." అర్ధాంతరంగా ఆపేడు.

ఇదే ఓ పాతికేళ్ళ అబ్బాయయితే తను ప్రేమించిన అమ్మాయికి తన మనసులోని విషయం చెప్పటాని కింత కష్టపడేవాడు కాదేమో అనిపించింది చంద్రశేఖరానికి. తన జంకు తనకే సిగ్గుగా వుంది. అవతల ఆమె రియాక్షన్ ఎలా వుంటుందోనని భయం.

"ఏదో చెప్పాలని సంశయిస్తున్నట్లున్నారు..." అడిగింది భారతే. ఈమెకి మైండ్ రీడింగ్‌గాని తెలుసా అన్పించింది అతనికి.

ప్రేమలో వున్న వైచిత్రి అదే. దానివల్ల ఒక విధమయిన సైకిక్ పవర్ వస్తుంది. తను ప్రేమించే ఎదుటి మనిషి చేస్తున్న ఆలోచనలు ట్రాన్స్‌పరెంట్‌గా కనిపిస్తుంటాయి.

"ఇఫ్ యు డోంట్ థింక్ అదర్‌వైస్...."

"ఇట్సాల్ రైట్. ఏదయినా ఉంటే మా బాబాయితో మాట్లాడండి. మిమ్మల్ని తప్పక అర్థం చేసుకుంటారు." అని ముగిస్తున్నట్లుగా లేచి నిలుచుంది భారతి.

గుండెలమీంచి కొంత బరువు దించినట్లయింది చంద్రశేఖరానికి. వాళ్ళ బాబాయితో మాట్లాడమన్న దంటే, తనకిష్టమేనన్నమాట. ఆమెని ఆటో ఎక్కించి బయలుదేరాడింటికి.

*

ఆవేళ సాయంత్రం అతను వస్తానన్న టైముకి ఇంట్లో వుండకూడదనుకుని, షాపింగ్ పేరుతో తప్పించుకుని వెళ్ళింది భారతి.

తిరిగి వచ్చేసరికి పిన్ని బాబాయిలిద్దరూ సీరియస్‌గా ఆలోచిస్తూ కూచుని వున్నారు. అతను వచ్చి వెళ్లి వుంటాడని ఊహించగలిగింది.

"నిన్న వచ్చిన చంద్రశేఖరం వచ్చి వెళ్ళాడమ్మాయి నువు లేనప్పుడు" రామనాథమే మొదలు పెట్టేడు.

"నిన్న డబ్బివ్వలేదు. ఇవాళగాని తెచ్చారా?" ఏమీ తెలియనిదాన్లా అడిగింది.

"నీ డబ్బు సంగతలా వుంచు. అతన్నిన్ను పెళ్లి చేసుకుంటానని వచ్చేడు భారతీ. అప్పట్నించి ఆ విషయమే ఆలోచిస్తున్నాం."

రాజేశ్వరమ్మ కలుగజేసుకొంది. "అంతగా ఆలోచించేందుకేం వుందీ అని నేననటం. మన భారతికి వయసూ, ఒడ్డూ పొడుగూ చక్కగా సరిపోతాడు. మంచి ఉద్యోగం చేస్తున్నాడు. భార్య పోయిన వాడయినా పెద్దగా వయసేం అవలేదు. అసలిది మన భారతి అదృష్టం కాదూ?"

ఆశ్చర్యపోయిందా మాటలకి భారతి. తను చంద్రశేఖరాన్ని చేసుకోవటానికి చాలా వ్యతిరేకిస్తుందనుకున్న ఆవిడ ఇంత సులభంగా తేల్చేయటానికి వెనక తనంటే వున్న ప్రేమ, తనకొక రక్షణ కల్పించాలనే తపన ఉన్నాయని అర్థం చేసుకుంది.

తనకంటే పదేళ్లు మాత్రమే పెద్దయిన పిన్ని వయిపు చూస్తుంటే ఆమె కళ్ళలో నీళ్ళు తిరుగుతున్నాయి.

"అదికాదు రాజూ, భార్య పోయిన మగవాడు పిల్లలున్నా లేకపోయినా మళ్ళీ పెళ్ళి చేసుకోవటం మామూలే. మరి...."

"ఏమిటండీ? నావన్నీ ఆధునిక భావాలేనని గొప్పగా చెప్పుకునే మీరే యిలా అంటున్నారేం? భారతి సుఖంగా సంతోషంగా వుండటమేగా మన క్కావలసింది. అంతకంటే దూరం ఆలోచించకండి."

సాలోచనగా భారతి వయిపు చూసారిద్దరూ. మౌనంగా వింటున్న ఆమె భావాలు చదివితే, ఆమెకీ పెళ్లి యిష్టమే అన్నట్లు తోచింది.

"సరే. ముందుగా అతన్ని గురించిన వివరాలన్నీ కనుక్కుంటాను" అంటూ భోజనానికి లేచాడు రామనాథం.

## 4

భారతి కొత్తగా వచ్చిన ఉద్యోగంలో చేరి నెల రోజులవుతోంది. భారతీ, చంద్రశేఖరాల వివాహానికి ఒక ముహూర్తం నిర్ణయం అయింది. రిజిస్ట్రార్ ఆఫీస్‌లో అప్లికేషన్లు పెట్టడమూ అయింది. అక్కడ తతంగం నిదానంగా చూసుకోవచ్చని, మొదట శాస్త్రోక్తంగా దేవాలయంలో పెళ్ళి చేయటానికి నిర్ణయించేడు రామనాథం.

ఆవేళ ఉదయం ఆమె స్కూలుకి వెళ్లేముందు, భారతిని దగ్గరికి పిలిచి, రెండు వేల రూపాయిలున్న కట్ట చేత పెట్టింది రాజేశ్వరమ్మ. "మీ బాబాయివ్వమన్నారు. ఇద్దరూ బట్టలు తీసుకోండి" అంది. మొహమాటంగా వుంది భారతికి. "ఎందుకు పిన్నీ, నా ఎకౌంట్‌లో ఉందిగా" అని నసిగింది. "ఫరవాలేదు. నీ ఎకౌంట్‌లో వున్నది నీ ఇష్టం. మా సంతృప్తికోసం మేమిస్తున్నదిది" అన్నది రాజేశ్వరమ్మ. భారతి మరింకేం మాట్లాడలేక పోయింది.

స్కూల్ నించి చంద్రశేఖరానికి ఫోన్ చేసింది. ఇద్దరం కలిసి సాయంకాలం షాపింగ్ వెళదామని.

రాజాజీనగర్ బస్‌స్టాప్‌లో ఆమెని కలుసుకున్నాడు చంద్రశేఖరం. ఇద్దరూ కలిసి, కమర్షియల్ స్ట్రీట్‌కి బయలుదేరారు.

ఒక పెద్ద షోరూమ్‌కి తీసికెళ్లి, మంచి సూటింగ్ క్లాత్ సెలక్ట్ చేయమంది భారతి. "ఎవరికీ" అని అతనడిగితే, "ఎవరికో నేనెందుకొంటాను? మీకే" అంది నవ్వుతూ.

అప్పుడు తోచింది చంద్రశేఖరానికి, తమ పెళ్లికి తను ఆమెకో చీర తీసివ్వాలని, ఓ నగ కొనివ్వాలనీను.

అరగంటలో సెలక్షన్ అయింది. అటునించి బయలుదేరి, ఓ జత షూ, సాక్స్, మంచి సూట్‌కి మాచ్ అయే టై, టైపిన్, కఫ్‌లింక్స్, ఇన్నీ కొనటం అయినాక, చీరల షాపుకి వెళ్ళేరు.

చిక్కపేటలోని సిల్క్‌పాలెస్‌లో, చీరలు చూశారు. కాస్త డాబుగా, నిండుగా జరీ ఉన్న

ఎరుపుచీర ఒకటి, సాదాగా కన్పించే కొత్తరకం ప్రింటెడ్ చీర ఒకటి తీసుకుంది భారతి. బిల్ మాత్రం తనదేనని ఇచ్చేశాడు చంద్రశేఖరం. అతనలా తనకోసం, గుట్టలుగా చీరలు లాగించి, సెలక్షన్‌లో సహాయం చేసి, బిల్ ఇస్తోంటే, ఏదో ఒక వింత అనుభూతి కలిగింది భారతిలో.

" ఇప్పట్నించీ నేనేసుకునే బట్టల్లో అతని టేస్ట్, అతనుపయోగించే వస్తువుల్లో నా ఇష్టాఇష్టాలు చోటు చేసుకుంటాయి కాబోలు '' అనుకుని నవ్వుకుంది.

ఆమె లోలోపల నవ్వుకోవటం తెలుస్తోందతనికి. తర్వాత ఇద్దరూ కలిసి ఒక పెద్ద హోటల్ ఎయిర్ కండిషన్డ్ రూమ్‌లో, 'చంపాకలి' స్వీట్ తింటున్నప్పుడు, అడిగేడు విషయం ఏమిటని. సిగ్గుతో ఆమె బుగ్గలు ఎరుపెక్కాయి. ఆ సిగ్గు ముచ్చటగా వుంది చంద్రశేఖరానికి. టేబిల్ మీద ప్లేట్‌పక్కనే ఉన్న ఆమె చేతిని అందుకుని మెల్లిగా నొక్కేడు.

పెళ్లి రోజు రానేవచ్చింది. ఉదయం పది గంటలకి ముహూర్తం. మల్లేశ్వరం విఘ్నేశ్వరుని ఆలయంలో, సింపుల్‌గా మాంగల్యధారణ జరిగిపోయింది. దండలు మార్చుకోవటం అయినాక, రామనాధం వారిద్దరి చేతులు కలిపి, " మేమిద్దరం ఇలాగే జీవితమంతా ఒకరిచేతినొకరు విడువకుండా, తోడునీడగా ఉండిపోతాము '' అని ఇద్దరితో విడివిడిగా ప్రమాణాలు చేయించాడు.

*

సాయంత్రం హోటల్లో కొలీగ్స్‌కీ, ఫ్రెండ్స్‌కీ పార్టీ ఇచ్చేడు చంద్రశేఖరం. పార్టీ అయేసరికి ఎనిమిది గంటలయింది. అందరూ వెళ్ళిన తర్వాత రామనాధం, రాజేశ్వరమ్మ బయలుదేరారు.

" వెళ్ళొచ్చేదా భారతీ '' అని భారతి చేతులు పట్టుకున్న పిన్ని కళ్ళలో నీళ్ళు తిరిగేయి. భారతి నోట మాటే రాలేదు. గొంతుకలో ఏదో అడ్డు పడినట్లుగా ఉంది.

" మరి వెళ్ళొస్తామయ్యా. అప్పుడప్పుడూ మాకు కనిపించి వెళుతుండండి. మాకదే సంతృప్తి.'' అంటున్న రామనాధానికి, చేతులు కలిపి నమస్కరించేడు చంద్రశేఖరం.

హోటల్ లౌంజ్‌లో కూచున్నారు భారతీ, చంద్రశేఖరం.

" భోజనం అయ్యాక ఇంటికి వెళదామా ?''.

" నో. నో. ఇప్పుడింటికెందుకు. ఉదయం వెళ్తే సరి. ఇక్కడే ఓ రూమ్ బుక్ చేసాను.

ఇది వింతగా అనిపించింది భారతికి. మొదటగా తామిద్దరూ కలిసి జీవించటం, ఓ హోటల్ గదిలో ఎందుకు మొదలవాలి ? హాయిగా ఇంటికి వెళ్ళకుండా–అనుకుంది. అయినా అతను ముందే ప్లాన్ వేసి రూమ్ బుక్ చేయించాక, తను చెప్పేదేం లేదని వూరుకుంది.

ఇద్దరూ భోంచేసి, మూడోఫ్లోర్‌లో ఉన్న రూముకి బయలుదేరేరు. వీళ్ళు వెళ్ళేసరికే గది తలుపుకి, " న్యూలీవెడ్స్ డోంట్ డిస్టర్బ్ '' అని రాసి ఉన్న ప్లాస్టిక్ ప్లేట్ ఒకటి వేళాడుతోంది. ఆశ్చర్యంగా చూసింది చంద్రశేఖరం వయిపు. ఇది మనకోసమే-అన్నట్లు చిన్నగా నవ్వేడు అతను.

తలుపులు తీయగానే, మంచి అగరొత్తుల వాసన గుప్పుమన్నది. విశాలమయిన గదిలో ఉన్న ఫర్నిచర్ అంతా, ఆ గది ఖరీదుని తెలుపుతున్నది. ఒక వయపుగా పెద్ద కిటికీకి దగ్గరగా, ఒక సోఫా, రెండు సింగిల్ సోఫాలు, మధ్యలో ఒక టీపాయి ఉన్నాయి. మరొక చివర్లో, పెద్ద మంచం, దాదాపు నలుగురు మనుషులు సులభంగా, సుఖంగా నిద్రపోగల సైజుది ఉంది. దాని మీద చిన్న లతల అంచులున్న లేత నీలం బెడ్‌షీటు పరిచి వుంది. దాని మీద సాయంత్రమే చల్లి వుంచిన మల్లె మొగ్గలు అప్పుడే విచ్చుకుని వాసనలు వెదజల్లుతున్నాయి. ఒక మూలగా వాష్ చేసిన పెద్ద అద్దం, టాయిలెట్ సామాన్లు అమర్చి వున్నాయి. నేల మీద పరిచి వున్న కార్పెట్, అడుగులు వేస్తుంటే లోపలికి కూరుకు పోతున్నంత మెత్తగా ఉంది.

అంతా ఒక చూపులో, ఒక్క క్షణంలో పరిశీలించింది భారతి. తమని రిసీవ్ చేసుకోటానికి ఎవరూ లేని ఇంటి కంటే, ఇదే బావున్నట్లు తోచింది. ఈ రోజు తన జీవితంలో మరపురానిది. అనుకోని ఈ అదృష్టం ఆమెని తబ్బిబ్బు చేస్తోంది. మామూలుగా చిన్న వయసులో వున్న కొత్త పెళ్ళికూతుర్లా సిగ్గుపడటానికి కూడా అభిమానంగా వుందామెకి. అసలు తను ఎలా ప్రవర్తిస్తే అతనికి నచ్చుతుందో తెలియటమూ లేదు.

గదిలో అడుగేసి, అతను డోర్ లాక్ చేస్తుంటే అయోమయంగా చూస్తూ నిలుచున్న భారతిని చూసి నవ్వుకుని, చొరవగా భుజాల చుట్టూ చేయి వేసి నడిపిస్తూ, " అయిదు నిమిషాలలా కూర్చో. నేనిప్పుడే స్నానం చేసి వస్తాను '' అన్నాడు మృదువుగా చంద్రశేఖరం.

టేబిల్ మీదున్న ఇంగ్లీషు మాగజీన్ చేతిలోకి తీసుకుని సోఫాలో కూచుంది. ఆమెకి నగలంటే అంతగా ఇష్టం లేదు. అతను తనకని తెచ్చిన పచ్చరాళ్ళ నెక్‌లేస్ సాయంత్రం నుంచి వేసుకుని విసుగ్గా తోస్తోంది. పోనీ తీసేద్దామా అంటే,

సి. ఛాయానాయుడు

విజయవాడ మేరీస్టెల్లా కళాశాల ద్వారా ఆంగ్ల సాహిత్యంలో పట్టభద్రురాలైన కుమారి ఛాయానాయుడు 'స్త్రీ, స్త్రీ స్వాతంత్రానికి ఇంకా ఇవతలి ఒడ్డునే వున్నది. సంపూర్ణ స్వాతంత్రాన్ని, సాధించాలంటే అందుకు ఆర్థిక సమానత్వం అవసరం. ఇందుకు మొదటి మెట్టు ఉద్యోగం' అని అభిప్రాయపడతారు. ఈ అభిప్రాయంతోను, తను నేర్చిన విద్య పిల్లలకు బోధించడానికి ఉపయోగపడాలన్న తపనతోనూ ఆమె ఉపాధ్యాయ వృత్తిని స్వీకరించారు. ఛాయానాయుడు 1975 లో గోల్డ్ స్పాట్‌వారి సౌజన్యంతో విజయవాడ ఇన్నర్‌వీల్ క్లబ్ వారు ఏర్పాటు చేసిన అందాలరాణి పోటీలలో పాల్గొని 'మిస్ ఆంధ్రప్రదేశ్'గా ఎన్నికయిన అందాలరాణి. అయితే అంతమాత్రం చేత సినిమాలలో నటించాలన్న కోరిక తనకు లేదంటారు కుమారి ఛాయ. విదేశంలో ఆమె అక్కాబావగార్లు వున్నారు. త్వరలోనే అక్కడకు వెళ్ళి పై



చదువులు చదివే ప్రయత్నంలో ఉన్న ఛాయానాయుడు 'వీలైతే అక్కడ కూడా ఉద్యోగం చేస్తూనే చదువుకొనసాగిస్తాను' అని అంటారు.

—విజయవాడ విలేకరి

అతనేమయినా అనుకుంటాడేమోనని భయం. తలెత్తితే ఎదురుగా అద్దం, వాష్ బేసిన్ కనిపించాయి.

ముఖం కడుక్కుని పలుచగా పవుడర్ అద్ది, బొట్టు పెట్టుకుంది. బొట్టుతో కొత్తగా కనిపిస్తున్న ముఖాన్ని కాస్సేపు చూసుకుంది. రిసెప్షన్ కోసమని చేసుకున్న హేర్‌డూ అంతా తీసేసి, వదులుగా జడ అల్లుకుంది.

ఇంతలో తలుపు చిన్నగా కొట్టినట్లయింది. తీస్తే, ఒక బోయ్ వచ్చి, నాలుగయిదు రకాల పళ్ళు, ఓ ఫ్లాస్కు, ఒక మల్లెల మాల వున్న ట్రే తెచ్చిపెట్టి వెళ్ళిపోయాడు.

చంద్రశేఖరం స్నానం అయింది. సిల్కు లుంగీ కట్టుకుని, పెద్ద టర్కీటవలు భుజాల చుట్టూ కప్పుకుని వచ్చాడు. తడి పొడిగా వున్న వెంట్రుకల నుంచీ, షాంపూ వాసన వస్తోంది.

"రోజూ రాత్రి ఫ్రెష్‌గా స్నానం చేస్తేగానీ నాకు నిద్ర పట్టదు" అన్నాడు. అంతసేపు ఆమెని ఒంటరిగా కూచోబెట్టినందుకు అపాలజీ చెప్పుకుంటున్నట్లుగా ఇప్పటికిప్పుడు. కొత్తగా కనిపిస్తున్న అతని ముఖంలోనికి నేరుగా చూడలేకపోయింది భారతి. వెళ్ళి సోఫాలో ఆమె పక్కనే కూచుని, "భారతీ ఎందుకంతగా తల వంచేస్తున్నావ్?" అంటూ గడ్డం పట్టి పయికెత్తబోయాడు.

భారతి గుండె జల్లుమంది. "ఏం చేస్తున్నదీ కూడా తెలియనిదానిలా గబుక్కున అతని వడిలో ముఖం దాచేసి, అతని వీపు చుట్టూ చేతులు వేసింది. అతను సంతృప్తిగా కొంచెంసేపు భారతి తలనిమురుతూ వుండిపోయాడు.

మెల్లిగా తనని తాను సంబాళించుకుని తల పైకెత్తిన భారతితో, 'ఆహేర్‌స్టయిల్ మేకప్‌తో కంటే సింపిల్‌గా నాకిలాగే బావున్నావు! మంచి పని చేశావు. ఉండు. ఈ నెక్‌లెస్ తీస్తాను. విసుగ్గా గుచ్చుతూ వుందేమో' అంటూ, ఆమెని పూర్తిగా తన వడిలోకి లాగి కూచోబెట్టుకుని, నెక్‌లేస్ తీసి పెట్టాడు. టీపాయి మీదున్న పువ్వులు అందుకుని, తలలో తురిమాడు. అతను మరింత దగ్గరగా లాక్కుని గట్టిగా పువ్వులు వాసన చూడటం గమనించిన భారతి, "అబ్బ! మల్లెల వాసన మత్తుగా వుంది కదూ?" అన్నది. "ఉహూ! నీ హెర్ స్మెల్ అంతకన్నా మత్తుగా ఉంది." అన్నాడు మెల్లిగా అతను. దాంతో మరింత సిగ్గుపడిపోయి, అతని వక్షంలో ముఖం దాచుకుంది.

భార్య పోయినప్పట్నించీ స్త్రీ స్పర్శ ఎరుగనివాడేం కాదు చంద్రశేఖరం. అయినా భారతి తన భార్య అనుకుంటే, ఆమె అలా తన గుండెల్లో ముఖం దాచుకుని, మెడ చుట్టూ చేతులేసి వుంటే, ఏదో సంతృప్తిగా, చెప్పలేనంత సంతోషంగా వుంది అతనికి. ఆ సంతోషాన్ని ఆమెతో పంచుకుందామంటే, మాటలు రావటం లేదు. అయితేనేం, ఆ నిశ్శబ్దంలో లయగా కొట్టుకుంటున్న అతని గుండెల శబ్దాన్ని వింటున్న భారతికి, అతని మనసులోని భావాలన్నీ తెలుస్తూనే వున్నాయి.

అతను "ఫ్లాస్కులో కాఫీ వుంది. తాగుదామా" అనేవరకూ, తనలా ఎంతసేపున్నదీ తెలియలేదు భారతికి. ఉలిక్కిపడిన దానిలా, అతని చేతులని విడిపించుకుంది, కాఫీ కప్పులో ఒంచి అతనికిచ్చింది. ఇలా రాత్రి కాఫీ తాగట మామెకి అలవాటు లేదు. అయినా, అతనికి కంపెనీ ఇవ్వటానికి కొద్దిగా తనకు వంపుకుని తెచ్చుకుంది.

తర్వాత కాస్సేపు సాయంత్రం వచ్చిన తన స్నేహితులు, అతిధుల గురించి చెప్పాడు భారతికి. ఆ కాస్సేపట్లోనే అతను రెండు సిగరెట్లు కాల్చటం చూసి, "ఈయన కాస్త ఎక్కువే స్మోక్ చేస్తారు" అనుకుని, "రోజు కెన్ని సిగరెట్లు కాలుస్తారు?" అని అడిగింది నవ్వుతూ.

"సారీ భారతీ! ఏమిటో పని చేస్తున్నప్పుడు ఏక్టివ్‌గా వుండటానికీ, పనిలేనప్పుడు బోర్ కొట్టకుండా వుండాలనీ, స్మోకింగ్ బాగా అలవాటయింది. ఇప్పుడు నువ్వొచ్చావుగా, తగ్గిం చేస్తాను" అన్నాడామె ప్రశ్నని తప్పించుకుంటూ.

చేతిలో సిగరెట్ పీకని ఏష్‌ట్రేలో పడేసి, వాష్ బేసిన్‌లో నీళ్ళు పుక్కిలించి వేసి వచ్చాడు.

"బాగా అలసినట్లుగా వున్నావు. నిద్రొస్తోందా?" అడిగాడు.

నిజానికామెకీ సాన్నిహిత్యం, కొత్తగా రుచి చూస్తున్న అతని స్పర్శ, ఈ వ్యక్తి నన్ను కోరి చేపట్టినవాడు అనే అనుభూతి, కలగాపులగంగా కలచి వేస్తున్నాయి. అతడి మీద ప్రేమతో మనసంతా నిండి, దూది పింజలా తేలికయినట్లుంది. అతని చేయి పట్టుకుని ఎలా మంచం మీద చేరిందీ ఆమెకి గుర్తులేదు.

"ఆవేళ నిన్నలా రైల్లో చూసినప్పట్నించీ, నాకేమయిందీ నాకే తెలియదు. ఎప్పుడెప్పుడిలా నిన్ను నా దగ్గర చేర్చుకుంటానా అని ఎంతగా ఎదురు చూసేనో" అంటూ మొదటిసారిగా ఆమె పెదవుల్ని ముద్దు పెట్టుకున్నాడు. మెల్లిగా కదులుతున్న ఆమె పెదవుల్లోంచి వస్తున్న శబ్దాల్ని వినటానికి ప్రయత్నించాడు. "మన మెప్పుడూ ఇలాగే ఉండి పోతాం కదూ?" అంటూంది.

"ఎస్ డాళింగ్ .... నువ్వెప్పుడూ ఇలాగే నా ఎదలోనే వుంటావు" అంటుంటే అతని స్వరం జీరవోయింది.

## 5

భారతి వచ్చాక చంద్రశేఖరం ఇంట్లో చాలా మార్పులు, చేర్పులు జరిగాయి. వసంత నగర్‌లో, కన్నింగ్‌హోమ్ రోడ్ అనుకుని వున్న ఒక వీధిలో ఉందా ఇల్లు. గేట్‌లోంచి ప్రవేశించగానే, రెండు గజాల పొడవునా దారికి రెండు వయిపులా వున్న జీనియా మొక్కలు స్వాగతం చెబుతాయి. చిన్న పోర్టికోలోంచి, నాలుగు మెట్లెక్కి తలుపు తీస్తే ఎదురుగా ఓ హాలు, దానికొక వయిపుగా చంద్రశేఖరం ఆఫీసు గది, మరోవయిపు కిచెన్, స్టోర్ రూమ్ వున్నాయి. వెనగ్గా చిన్న బెడ్‌రూమ్, డైనింగ్‌హాలు, బాత్‌రూమ్ వున్నాయి. డైనింగ్ రూమ్‌లోంచి, మేడ మీది మరో బెడ్‌రూమ్‌కి మెట్లున్నాయి.

ఇంటి వెనగ్గా వున్న చిన్న పెంకుల గదిలో రామన్న వుంటాడు. రామన్న, ఆ ఇంటికి తోటమాలి, కుక్, సర్వెంట్ అన్నీను. చంద్రశేఖరం బెంగళూరులో సెటిలయినప్పట్నించీ, నమ్మిన బంటులా అతనితో వున్నాడు రామన్న.

చంద్రశేఖరం ఆఫీసు పని మీద కేంపు వెళ్లేడు. ఆవేళ శనివారం. మధ్యాన్నం ఒంటి గంటకే స్కూల్‌నించి వచ్చిన భారతి హాల్లో కూర్చుని పేపర్ చూస్తూ, "పిన్నివాళ్ళను చూసివద్దామా?" అనుకుంది. గతవారం ఇద్దరూ కలిసి వెళ్లి ఆదివారం అక్కడే గడిపి వొచ్చారు. ఈ వారం, వాళ్ళనే ఇక్కడి కాహ్వానిద్దామనుకుంటే అతను వూరు వెళ్ళేడు.

ఇంతలో పోస్ట్ వచ్చింది. తనొచ్చాక ఇంటికి ఒక లెటర్ రావటం ఇదే మొదలు. అఫీషియల్ కాదు కాబట్టి, ఏమిటో చూద్దామని చింపి చూసింది. మద్రాసులో ఓ కాన్వెంట్ నించీ, వార్డన్ రాసిన ఉత్తరమది. అందులో ఇలా వుంది.

[ముగింపు వచ్చే సంచికలో]